ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 3 డిసెంబరు 2025 | 3



నేడు నల్లజర్లకు సీఎం చంద్రబాబు రాక

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాకకు నల్లజర్ల ముస్తాబైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు బుధవారం ఉదయం 10.30గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలి కాప్టర్‌లో బయలుదేరి 10.55 గంటలకు నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 11.10 గంటలకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి 11.30గంటలకు నల్లజర్లలో వ్యవసాయ భూమి పరిశీలనకు వెళ్తారు. 11.30 నుంచి 11.50 వరకూ స్టాల్స్‌ను సందర్శిస్తారు. కలెక్టర్ స్వాగత ప్రసంగం చేస్తారు. 12.15 నుంచి 12.20 వరకూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రసంగిస్తారు. సీఎం చంద్రబాబు 12.55 గంటల వరకూ 1000 మంది రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. వేదికపై ఏర్పాటు చేసిన మంచంపై కూర్చుని రైతులు, వారి కుటుంబాలతో కూడా మాట్లాడతారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారు. తర్వాత మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విశ్రాంతి తీసుకుంటారు. 1.45 నుంచి 3.15 గంటల వరకూ గోపాలపురం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 3.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.30 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 3.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళ్తారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పెద్దసంఖ్యలో రైతులు పాల్గొంటున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజావేదిక వద్ద ఐదు స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. సభలో రైతులు, వ్యవసాయం, హార్టీకల్చర్, మత్స్య శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జీవీకే అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహ కిశోర్ పరిశీలించారు. 1200మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. పర్యటన సజావుగా సాగేలా సభావేదిక, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో ముందస్తు ఏర్పాట్లు, భద్రత చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జేసీ వై.మేఘ స్వరూప్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించారు.

‘దిత్వా’ ప్రభావం

- వర్షాలతో ఖరీఫ్ మాసూళ్లకు అంతరాయం
- తడిసి ముద్దవుతున్న ధాన్యం రాశులు, పనలు
- జిల్లాలో వానలతో అన్నదాతల్లో ఆందోళన



రావులపాలెం మండలం ఇమ్మిడివరప్పాడులో ధాన్యం రాశులను బరకాలతో సంరక్షించిన రైతులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

దిత్వా తుఫాన్ ప్రభావంతో మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరునుంచి ప్రారంభమై జోరుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ సేద్యం సాగుచేసిన అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. సరిగ్గా పంట చేతికి వచ్చే సమయంలో ఇప్పుడు మళ్లీ మొదలైన వర్షాలవల్ల రైతులు తీవ్రమైన నష్టాల బారిన పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ వరిసాగు నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒకవైపు కోతలు, మరోవైపు ధాన్యం ఎండబెట్టుకునే పనిలో రైతులు ఉన్నారు. రెండురోజులుగా ప్రభావం చూపని వర్షం మంగళవారం జోరుగా కురిసింది. దీంతో రైతులు పంటలను ఒబ్బిడి చేసుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్నిరోజులుగా ఎండలతో కూడిన వాతావరణంవల్ల జిల్లాలోని అన్నిప్రాంతాల్లోను కోతలు ముమ్మరమయ్యాయి.ఎక్కడికక్కడే ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకునే పనిలో అన్నదాతలు ఉన్నారు. దిత్వా తుఫాన్ ప్రభావంవల్ల వర్షాలు ఒక్కసారిగా తీవ్రమయ్యాయి. దీంతో పంటచేలో ఉన్న పనలు, గట్లపై ఉన్న ధాన్యపు రాశులను సంరక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పాశర్లపూడి నుంచి శివకోడు వెళ్లే జాతీయ రహదారి సీసీ రోడ్డు కావడంతో వందలాదిమంది రైతులు దారి పొడవునా ధాన్యపు రాశులు వేసి ఆరబెట్టుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాల ప్రభావంతో ధాన్యం నిల్వలను రాశులుగా వేసి బరకాలతో కప్పెడుతున్నారు. వాతావరణ పరిస్థితులు బాలేనందున రైతులు పంటలను శరవేగంగా ఒబ్బిడి చేసుకుని ధాన్యం కేంద్రాల్లో విక్రయించుకోవాలని కలెక్టర్ ఇప్పటికే సూచన చేశారు. ధాన్యాన్ని రాశులుగా వేయడం వల్ల ముక్కిపోయి రంగు మారుతుందని, అటువంటి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కాకినాడ పెద్దాసుపత్రిలో జ్వరపీడితులు

ఆసుపత్రులకు క్యూ!

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న జ్వరపీడితులు



అమలాపురం మండలం బండారులంకలో ఫీవర్ సర్వే

ఫీవర్స్.. వైరల్!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జ్వర పీడితులు పెరుగుతున్నారు. చిన్న,పెద్ద, తేడా లేకుండా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. గత వారం రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో భారీగా కేసులు నమోదవుతున్నాయి. సాధారణంగా కాకినాడ జీజీహెచ్‌కు ప్రతి రోజూ 2 వేలకు పైగా ఓపీ ఉంటుంది.వీరిలో జ్వర పీడితులే అధికంగా ఉంటున్నారు. రాజ మహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రతిరోజూ సుమారు వెయ్యి నుంచి 1200ల వరకూ ఓపీ ఉంటే వీరిలో ఎక్కువ మంది సీజనల్ వ్యాధులతోనే ఆసుపత్రికి వస్తున్నట్టు జనరల్ మెడిసిన్ వైద్యులు చెబుతున్నారు. కోనసీమలోనూ ఇదే పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి లక్షణాలతో ఆసుపత్రులకు వస్తున్నారు. ఇంట్లో ఒకరి తర్వాత ఒకరు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి పోతున్నారు.జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రం తగ్గడం లేదని మళ్లీ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.అసలే జ్వరంతో రోగులు బాధపడుతుంటే రకరకాల టెస్టులతో ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు మరింత నీరసించేలా చేస్తున్నారు.రక్త, బీపీ, షుగర్ టెస్టులతో పిండేస్తున్నారు. పలువురు ఆసుపత్రులకు వెళ్లేందుకే భయపడుతున్నారు.

సీజన్ మారింది. చలిగాలుల తాకిడి అధికమైంది. తుఫాన్ ప్రభావంతో ఒక వైపు వానలు కురుస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులు అధికంగా జ్వరాల బారిన పడుతున్నారు. శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గాలిలో వైరస్ కారణంగా చికెన్ ఫాక్స్, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పు లు, గొంతు నొప్పి, కీళ్ల నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలతో క్యూ కడుతున్నారు. కొన్ని నెలలుగా డెంగీ, మలేరియా కేసులు నమోదవుతుండగా స్క్రబ్ టైఫస్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి.

- కాకినాడ/ అమలాపురం/రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి)

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసులు
- వైరల్, డెంగీ జ్వరాలతో ఇక్కట్లు
- కాకినాడలో స్క్రబ్ టైఫస్ కేసులు
- తూర్పు, కోనసీమల్లో డెంగీ

కాకినాడలో స్క్రబ్ టైఫస్..

ఈ ఏడాది జనవరి నుంచి పరిశీలిస్తే కాకినాడలో ఐదు వేల మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 200కిపైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. నాలుగు నెలలుగా కేసులు పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు కలవరపెడుతున్నాయి. నల్లి లాంటి ఓ కీటకం కుట్టడం ద్వారా కుట్టినచోట దద్దుర్లు, నల్లటి మచ్చలు ఏర్పడడం, జ్వరం, వాంతులు, తల, ఒంటి నొప్పులు, పొడి దగ్గు లక్షణాలతో ఆస్పత్రికి వచ్చేవారు అధికమయ్యారు. లాలాజలంతో ఈ ఇన్ఫెక్షన్ ఒకరి నుంచి మరొకరికి సోకుతున్నట్టు వైద్యులు ప్రాథమికంగా గుర్తించారు. కాకినాడ జిల్లాలోనే అత్యధికంగా 1452 మందికి పరీక్షలు చేయగా 148 కేసులు నమోదయ్యాయి. కాకినాడ, అర్బన్, గ్రామీణ ప్రాంతాలతోపాటు సామర్లకోట, పెద్దాపురం తుని, ప్రత్తిపాడు ప్రాంతాల నుంచి ఎక్కువ కేసులు వచ్చాయి. మిగతా మండలాల్లోను ఈ వ్యాధి బాధితులు ఉన్నారు. గత నెల నవంబర్‌లో 251 మందిని పరీక్షించగా 47మంది ఈ వ్యాధికి గురయ్యారు.

స్క్రబ్ టైఫస్ సోకితే ఐదు రోజులు వైద్యం

స్క్రబ్ టైఫస్ సోకడానికి పరిసరాల అపరిశుభ్రతే కారణం. ఇంటి పరిసరాలు, పనిచేసే ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి. తుప్పల వద్ద జాగ్రత్తగా ఉండాలి. వ్యాధి సోకితే నివారణకు ఐదు రోజుల పాటు వైద్యం తీసుకోవాలి.

- డాక్టర్ ప్రభాకర్, కాకినాడ మలేరియా అధికారి

కోనసీమలో డెంగీ

కోనసీమ జిల్లాలోనూ జ్వరపీడితులు ఉన్నారు. గతేడాది జిల్లాలో 292 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 34 కేసులు నమోదయ్యాయి. వైరల్ జ్వరాల బారిన పడినవారు గతంలో రోజువారీ నివేదికల్లో 250 మంది ఉండేవారు. ప్రస్తుతం రోజుకు 170 నుంచి 180 మంది ఉంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు వెల్లడించారు. నవంబరులో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ విభాగంలో 61మందిని జ్వర పీడితులుగా గుర్తించారు. మరో 15 మంది ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకున్నారు. ప్రస్తుతం రోజుకు ఇద్దరు, ముగ్గురు మాత్రమే వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఒక డెంగీ కేసుకు ఆస్పత్రిలో వైద్యం చేయగా ఇద్దరు ఓపీ విభాగంలో డెంగీ పాజిటివ్‌గా గుర్తించామని అమలాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు వెల్లడించారు. జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులేమీ నమోదుకాలేదని డీఎంహెచ్‌వో దుర్గారావురావు వెల్లడించారు.

‘తూర్పు’న ఇలా..

తూర్పుగోదావరి జిల్లాలో మలేరియా, న్యుమోనియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఇన్‌పేషెంట్ కేసులు తక్కువగానే ఉన్నా అవుట్‌పేషెంట్లు ఎక్కువ మంది ఉంటున్నారు. పీడియాట్రిక్ విభాగంలో శ్వాసకోశ సంబంధిత సమస్యలతో చిన్నారులు వైద్యానికి వస్తున్నారు. జ్వరకేసులు నమోదవుతున్నాయి. పక్కనున్న ఏఎస్ఆర్ జిల్లా నుంచి మలేరియా కేసులు వస్తున్నాయని.. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం జీరో అని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో గోకవరం, నామవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జ్వరపీడితుల్లో కొందరికి ఇక్కడి వైద్యులు ప్రాథమికంగా మలేరియాగా నిర్ధారించినట్టు తెలిసింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో డెంగీ కేసులు మాత్రం 32 నమోదైనట్టు లెక్కలు చెబుతున్నారు.

ప్రత్యేక వైద్యం అందిస్తున్నాం

స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక దృష్టిసారించాం. గ్రామాల్లో అవగాహన కల్పి స్తున్నాం. జిల్లాలో జ్వర బాధితులకు ప్రత్యేక వైద్యం అందిస్తు న్నాం. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో నిత్యం వైద్యపరీక్షలు జరుగుతున్నాయి. అజిత్రోమైసిన్, డాక్సిసైక్లిన్ మందులను అందుబాటులో ఉంచాం. ఎక్కడైనా జ్వరపీడితులు పెరిగితే సమాచారం ఇవ్వాలి.

- నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

జిల్లాను కొబ్బరి, అరటి ఫైబర్ ముడిసరుకు ఆధారిత

పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దాలి

- పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాను కొబ్బరి, అరటి ఫైబర్ ముడిసరుకు ఆధారిత పారిశ్రామికహబ్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో 17వ జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెంలో అరటిఫైబర్, ద్రాక్షారామలో పప్పుదినుసులు, ఉప్పలగుప్తంలో క్వాయిర్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీకాంప్లెక్స్‌లు నియోజకవర్గానికి ఒక ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు ద్వారా స్థానిక ప్రజల జీవనోపాధుల కల్పనకు దోహదపడుతుందన్నారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త దిశగా వడివడిగా అడుగులు వేయాలని సూచించారు. జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు అధికారుల భాగస్వామ్యంతో కృషి చేయాలన్నారు. సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా ఈ లక్ష్యాలసాధనకు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కు, కాంప్లెక్స్‌లు ఏర్పాటు ద్వారా తక్కువ పెట్టుబడితో పారిశ్రామిక యూనిట్‌లు స్థాపించి యువతకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఎజెండాలో పొందుపరచిన 16వ డీఐఈపీసీ మినిట్స్ తీర్మానాలపై తీసుకున్న చర్యలను కలెక్టర్ సమీక్షించారు. ఏకవాక్య విధానం, వివిధ క్లియరెన్స్‌లు, పీఎం ఉపాధి కల్పన పథకం వంటి అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. జేసీ నిషాంతి, పరిశ్రమల కేంద్ర మేనేజర్ అరుణ, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ పద్మజ, ఏడీ శివరామ్‌ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుఅధికారి శంకరరావు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటనలో..

వినతుల పరిష్కారంపై నివేదికలివ్వండి

- జేసీ నిషాంతి ఆదేశం



వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న జేసీ నిషాంతి

ఉపముఖ్యమంత్రి పవన్ హామీలపై తీసుకుంటున్న చర్యలను శాఖలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా హామీలన్నింటినీ అధికారులు ఉన్నతస్థాయిలో సంప్రదించి వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. 46 విజ్ఞాపనలు అందాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు. డీఆర్వో కె.మాధవి, ఎల్డీఎం కేశవర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ రాజన్, పీఆర్ ఎస్ఈ పులి రామకృష్ణారెడ్డి, డీపీవో శాంతలక్ష్మి, ఏపీడీసీఎల్ ఎస్ఈ రాజేశ్వరి పాల్గొన్నారు.

అమలాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత నెల 26న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాజోలు నియోజకవర్గంలోని కేశనపల్లి, శివకోడు ప్రాంతాల్లో జరిపిన పర్యటనలో అందిన విజ్ఞాపనలపై పరిష్కార దిశగా చేపట్టిన చర్యల సమగ్ర నివేదికలను ఈనెల 8వతేదీకి సమర్పించాలని జేసీ టి.నిషాంతి అధికారులను మంగళవారం ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించి

జిల్లాలో వర్క్ ఫ్రం హోం పరీక్షలు ప్రారంభం



సాకుర్రులో ఆన్‌లైన్ పరీక్షలకు హాజరైన అభ్యర్థి

అమలాపురం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోం కింద నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మంగళవారం నుంచి సచివాలయాల వారీగా ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రోజువారీగా సచివాలయాల్లో పరీక్షలకు హాజరు కాబోయే అభ్యర్థులకు ముందస్తుగానే సమాచారం అందించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 515 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఒక్కో సచివాలయంలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల మధ్య రెండోసెషన్ పరీక్షలు నిర్వహించారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ, డిప్లమో, ఇంజనీరింగ్ అభ్యర్థులకు వారి కేటగిరీల ఆధారంగా పరీక్షలు నిర్వహించారు. ఈ వారంలో పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఇప్పటికే సమాచారం అందించారు. తొలిరోజు పరీక్షకు వివిధ కారణాలవల్ల హాజరు కాని అభ్యర్థులకు మరోసారి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

అన్నివర్గాలకు ఎస్సీ వర్గీకరణ ఫలాలు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాదిగ 5



అమలాపురం మండలం నడిపూడిలో కృష్ణమాదిగను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మోక్షం కలిగేనా?

- శంకరగుప్తం డ్రెయిన్‌కు ఉప్పునీటి నుంచి రక్షణ ఎలా?
- చింతలమోరి-కేశనపల్లి వరకు 22.90 కి.మీ. విస్తరించిన డ్రెయిన్
- వన్‌వే చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో ఉప్పునీటి ప్రవాహానికి బ్రేక్
- డిప్యూటీ సీఎం ప్రస్తావనతో బీసీ రోశయ్య కమిటీ సిఫార్సులపై చర్చ



మలికిపురం మండలంలో శంకరగుప్తం డ్రెయిన్ గుండా కొబ్బరిచెట్లలోకి ఎగదన్నుతున్న సముద్రపు నీరు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సముద్ర తీర ప్రాంత గ్రామాలను ఆనుకుని ఉన్న చింతలమోరి-శంకరగుప్తం డ్రెయిన్ అభివృద్ధిపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డ్రెయిన్‌లో పేరుకుపోయిన పూడికను డ్రెడ్జింగ్ ద్వారా తీయాలని జలవనరులశాఖ జిల్లా అధికారులు భావిస్తున్నారు. డ్రెయిన్ మూలాలను అధ్యయనం చేసిన ఇరిగేషన్ నిపుణుడైన బీసీ రోశయ్య నివేదిక మాత్రం మరో పరిష్కారాన్ని చూపింది. దీంతో ప్రస్తుతం ప్రతిష్టంభన ఏర్పడింది. డ్రెయిన్ వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించి పరిధిని 50మీటర్ల వెడల్పు చేసి 10నుంచి 12 అడుగుల లోతులో మట్టి తవ్వకాలు జరిపినప్పుడే ఆ డ్రెయిన్‌కు ఉప్పునీరు నుంచి మోక్షం కలుగుతుందని నివేదికలోని కొన్ని అంశాలు స్పష్టం చేస్తున్నాయి. గతనెల 26న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకరగుప్తండ్రెయిన్ పరిశీలించి రోశయ్యకమిటీ గురించి ఆరా తీయడంతో దీనిపై అందరి దృష్టిపడింది.

శంకరగుప్తం డ్రెయిన్ చరిత్ర

గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలో ముఖ్యమైన శంకరగుప్తం-కేశనపల్లి డ్రెయిన్ మలికిపురం మండలం చింతలమోరిలో ప్రారంభమై కేశవదాసుపాలెం, శంకరగుప్తం, పడమటిపాలెం,కేశనపల్లి, తూర్పుపాలెం, కరవాక గ్రామాల మీదుగా 22.90 కిలోమీటర్ల పొడవున ప్రధానంగా ప్రవహిస్తుంది. 57,619 క్యూసెక్కుల నీరు వైనతేయ గోదావరిలో కలుస్తుంది. దీన్నే రక్తతుల్య నది అని కూడా పిలుస్తారు. ఈ కాల్వ గుండా మూడు మీడియం డ్రెయిన్లు, 12 మైనర్ డ్రెయిన్లు, 27 స్థానిక రెవెన్యూ డ్రెయిన్ల నుంచి నీటి ప్రవాహం శంకరగుప్తం డ్రెయిన్‌లో కలిసి గోదావరిలోకి వెళ్తుంది. ఈ డ్రెయిన్ వైనతేయ గోదావరి కుడివైపున కుంగిపోయి సముద్రంలో కలుస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. నదిలో కలిసేచోట వరదలు, భారీవర్షాల సమయంలో 22.90 కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ డ్రెయిన్‌లోకి ఉప్పునీరు వెనక్కి మళ్లుతుంది. 2003-04 సంవత్సరంలో 16.50 కిలోమీటరు నుంచి 22.90 కిలోమీటరు వరకు అప్పట్లో డ్రెయిన్ తవ్వారు. మళ్లీ 2017-18లో 0.00 నుంచి 8.50 కిలోమీటర్ల వరకు డ్రెడ్జింగ్ చేసి ప్రవాహవేగాన్ని మెరుగుపరిచారు. రెండు పనుల్లోను 8.50 కిలోమీటర్ల నుంచి 16.50కిలోమీటర్ల వరకు రీచ్‌లు మిగిలిపోయాయి. ఈ ప్రాంతంలో భారీగా సిల్టు నిక్షేపమై ఉండడంవల్ల బెడ్ లెవెల్ 1.00 నుంచి 1.50 మీటర్ల వరకు తగ్గింది. ఈ సిల్టు కాల్వ సామర్థ్యాన్ని తగ్గించడంవల్ల వరదనీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. దీంతో డ్రైనేజీ నీరు పొంగి పొర్లడంతో సమీపంలో ఉన్న కొబ్బరిచెట్లు ముంపునకు గురై చనిపోతున్నాయి. దీని పునరుద్ధరణకు డ్రైనేజీశాఖ రూ.21కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

డ్రెడ్జింగే శరణ్యమంటున్న అధికారులు

ప్రస్తుతం సమస్యపై ఇంజనీరింగ్ అధికారులు సూచనలు చేశారు. డ్రెయిన్‌కు ఇరువైపులా గట్ల నిర్మాణానికి మట్టి ఎక్కువ అవసరం కాగా, సమీపంలో అందుబాటులోలేదు. ఇందుకు 8.50 కి.మీ. నుంచి 16.50 కి.మీ. వరకు డ్రెడ్జింగ్ ద్వారా మట్టిని తొలగించి 0.00 కి.మీ. నుంచి 14.50 కి.మీ.వరకు డ్రెడ్జింగ్ ద్వారా లభించే మట్టిని గట్లపై సర్వే కర్రలతో పైలు బాక్సులా వేసి మధ్యలో మట్టిని నింపి గట్లు ఏర్పాటు చేయడానికి రూ.20.62కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నిపుణుల కమిటీ నివేదికను సమర్పించాలి: కలెక్టర్

అమలాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు సంబంధించి 2006లో నిర్వహించిన నిపుణుల కమిటీ నివేదిక తర్వాత జరిగిన అభివృద్ధి పనుల గురించి రూపొందించిన నివేదికలను సమర్పించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ డ్రైనేజీ విభాగం ఇంజనీర్లను ఆదేశించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన డ్రైనేజీ, ఇరిగేషన్ ఇంజనీర్లతో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌అధ్యయన నివేదికపై సమీక్షించారు. మేజర్ డ్రెయిన్ పూడికతీతకు నోచుకోని కారణంగా సంభవిస్తున్న నష్టాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎల్‌ఐడీఏఆర్ సర్వే బృందంతో మరోదఫా సమావేశం ఈనెల 11న నిర్వహించనున్నట్టు తెలిపారు. టైడల్ బ్యాంకు పర్యావరణ కాలుష్యం, డ్రెడ్జింగ్ తదితర అంశాలపై స్పష్టత రానుందని, నరేగా అనుసంధానంతో అటవీశాఖ టైడల్ బ్యాంకుపై మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టిందనిఅన్నారు. కుండలేశ్వరంనుంచి ఓడలరేవువరకు టైడల్ బ్యాంకు నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలన్నారు. శంకరగుప్తం డ్రెయిన్ అభివృద్ధిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమావేశం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. డ్రెయిన్స్ ఈఈ కిశోర్, ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్, ఈఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న మలేరియా అధికారి

15 నుంచి..

ఫైలేరియా సర్వే

అమలాపురంరూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫైలేరియా(బోధకాలు) నివారణా చర్యల్లోభాగంగా ఈనెల 15నుంచి మూడురోజులపాటు ప్రత్యేక సర్వే నిర్వహించనున్నట్టు జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. ఫైలేరియాబాధితులు ఎక్కువగాఉన్న గ్రామాల్లో ప్రత్యేకంగా దృష్టిసారించామన్నారు. ఫైలేరియా ఉన్న వ్యక్తి రక్తంలోని మైక్రో ఫైలేరియా క్రిమిని ఆడ క్యూలెక్స్ దోమ ద్వారా ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుట్టినప్పుడు ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. మైక్రో ఫైలేరియా రాత్రిపూట మాత్రమే రక్తంలో కనబడుతుందన్నారు. అందువల్ల రాత్రి నిద్రపోయిన వారికి లేపి రక్త నమూనాలు సేకరిస్తామన్నారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో రాత్రి 10 గంటల నుంచి 12గంటల మధ్య రక్త నమూనాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నిర్దేశించిన హైరిస్క్ ఏరియాల్లో 300కుపైగా నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. రావులపాలెం మండలం ఊబలంక,రామచంద్రపురం మండలం మాచవరం, అచుత్యాపురం ప్రాంతాల్లో సర్వేపై ప్రధానంగా దృష్టిసారించామన్నారు. జిల్లాలో గతం నుంచి 6వేలమంది క్రానిక్ ఫైలేరియా బాధితులు ఉన్నారు. కొత్తగా కేసులు నమోదు కావడం లేదు. ప్రజలకు బోధకాలు నివారణ సర్వేపై పూర్తి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. గతంలో కేసులు నమోదైన ప్రాంతంలో, అక్కడక్కడా కేసులు వచ్చిన ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారుల పర్యవేక్షణలో ఆరోగ్య కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్లు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తామన్నారు.



విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్న దృశ్యం

దివ్యాంగుల మనో నేత్రం

వారంతా దివ్యాంగులు. విభిన్న ప్రతిభావంతులు, బుద్ధి మాంద్యం, వికలత్వం కలవారు. కుటుంబీకుల సహకారం లేనిదే కాలకృత్యాలు తీర్చుకోలేరు. అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది ఉమా మనో వికాస కేంద్రం. ఇది ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో గత 37 ఏళ్లుగా వేలాది మందికి సేవలందిస్తోంది. ఈ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి దివ్యాంగుల సాధికారితే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...





చిన్నారుల ఆట, పాట

ఉమా వికాస కేంద్రం

- దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆసరా
- 1988లో కాకినాడలో ప్రస్థానం
- 37 ఏళ్లుగా విశేష సేవలు
- రెండు సార్లు రాష్ట్రపతి, ఆరుసార్లు జాతీయ పురస్కారాలు

(సర్పవరం జంక్షన్ (కాకినాడ)-ఆంధ్రజ్యోతి)

దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, సాంఘిక సాధికారిత, పునరావాసం కల్పించేందుకు 1988లో కాకినాడలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ (ఉమా మనో వికాస కేంద్రం)ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి స్థాపించారు. తొలుత బుద్ధి మాంద్యత గల 9 మంది పిల్లలతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు వేలాది మంది విద్యార్థులకు ఆరోగ్యం, ప్రత్యేక విద్య, సమీకృత, వృత్తి విద్యనందిస్తోంది. సాంస్కృతిక, సాంఘికపరమైన శిక్షణ ఇస్తూ జీవనోపాధికి అవకాశాలు కల్పిస్తోంది. కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాలతో పాటు యానాంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలకు గుర్తింపుగా ఎస్‌పి రెడ్డి రెండు సార్లు రాష్ట్రపతి నుంచి ఉత్తమ అవార్డులు, ఆరు సార్లు జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు.

ప్రత్యేక స్కూల్, ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్స్

బుద్ధి మాంద్యత విద్యార్థులకు ప్రత్యేక విద్యతో పాటు ఆరేళ్లలోపు చిన్నారులకు, అభి వృద్ధి దశల్లో అలస్యమైన సుమారు 2,600 మం దికి ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అంది స్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రత్యేక స్కూల్లో ప్రత్యేక విద్యనందిస్తున్నారు. యానాంలో ప్రత్యేక స్కూల్, ఎర్లీ ఇంటర్వెన్షన్ సర్వీసెస్ సేవలు అందిస్తున్నారు. 2009 నుంచి తాళ్లరేవులో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ధీరుబాయి అంబానీ ఎర్లీ ఇంటర్వెన్షన్, పునరావాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అజీమ్ ప్రేమ్‌జీ ఆర్థిక సహకారంతో బధిర అంధత్వం, విశిష్ట వైకల్యం గల 420 మంది పిల్లలు, వ్యక్తులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి సంస్థాగత, గృహ ఆధారిత, సమాజ ఆధారిత పునరావాసం కల్పించారు.

సమాజ ఆధార పునరావాస కార్యక్రమం (సీబీఆర్): దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పునరావాసం కల్పించే ఉద్దేశ్యంతో 1994లో ఈ కార్యక్రమాన్ని రంపచోడవరం మండలంలో ప్రారంభించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల మేరకు ఇప్పటివరకు సుమారు 25వేల మందికి పైగా ఆరోగ్యం, విద్య, జీవనోపాధి ద్వారా లబ్ధి పొందారు.

ప్రత్యేక విద్య కళాశాల

దివ్యాంగుల్లో మానవ వనరుల అభివృద్ధి కోసం రీహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఎడ్యుకేషన్ (మెంటల్ రిటార్డేషన్, వినికిడి సమస్య) కోర్సులను 2021 నుంచి అక్కూ యూనివర్సిటీ అనుబంధ సంస్థగా ప్రత్యేక విద్యా కళాశాల నిర్వహిస్తున్నారు.



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి జాతీయ పురస్కారం అందుకుంటున్న ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి

జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం (డీడీఆర్‌సీ)

2011లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలో డీడీఆర్‌సీ ఏర్పాటుచేసి సేవలు అందిస్తున్నారు వికలత్వంపై అవగాహన సదస్సులు, చట్టాలు, సంక్షేమ పథకాలు, కృత్రిమ పరికరాల అంచనా, పంపిణీ చేస్తున్నారు. నవజాత శిశువుల్లో వినికిడి సమస్యను గుర్తించేందుకు కాకినాడ జీజీహెచ్‌లో ప్రతి గురువారం అత్యాధునిక ఏవోఈ, బెరా యంత్రాల ద్వారా పరీక్షలు నిర్వహించి పునరావాసం కల్పిస్తున్నారు.



కృత్రిమ కాలు తయారు చేస్తున్న దృశ్యం

కృత్రిమ అవయవాల తయారీ మొబైల్ వర్క్‌షాపు

కృత్రిమ అవయవాల తయారీ యూనిట్‌ని 1997లో ప్రారంభించారు. ట్రై సైకిల్స్ శ్రవణ యంత్రాలు, కృత్రిమ కాళ్లు వంటి సహాయ పరికరాలను ఏటా 700 నుంచి 900 వరకు పంపిణీ చేస్తున్నారు. 2015లో మొబైల్ వర్క్‌షాపుని రిలయన్స్ ఇండస్ట్రీస్ సహకారంతో వాకలపూడిలో ఏర్పాటుచేశారు. ఈ మొబైల్ యూనిట్ ప్రతి మండల కేంద్రానికీ వెళ్లి దివ్యాంగుల కృత్రిమ పరికరాలను రిపేర్ చేయడం, కొత్త వాటికి కొలతలు తీసుకోవడం చేస్తోంది.

నన్నయకు ఐదు ఐఎస్‌వో సర్టిఫికెట్లు



నన్నయ వర్శిటీకి లభించిన ఐదు ఐఎస్‌వో సర్టిఫికెట్లు చూపుతున్న వీసీ ప్రసన్నశ్రీ

- త్వరలో ఫైవ్‌స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ : వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్రాభివృద్ధి, ఉన్నత విద్యలో శ్రేష్ఠతను, నాణ్యతను అందించడానికి కృషిచేస్తూ తగిన వనరులను అందిస్తున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఐదు ఐఎస్‌వో సర్టిఫికెట్లు లభించాయని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. త్వరలో ఫైవ్‌స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ దక్కుతుందని చెప్పారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం ఐఎస్‌వో ఎగ్జిట్ సమావేశాన్ని ఐ.క్యూ ఏసీ డైరెక్టర్ వి.పెర్సిస్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి అలపాటి శివయ్య ఈ ఐదు సర్టిఫికెట్లను వీసీకి అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఐఎస్‌వో 50001:2018 అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ నిర్వహణ వ్యవస్థను అమలు చేసిన కారణంగా ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్, ఐఎస్‌వో 14001:2015 అవసరాలకు అనుగుణంగా పర్యావరణ నిర్వహణ వ్యవస్థను అమలు చేసిన కారణంగా ఎన్విరాన్మెంటల్ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్, ఐఎస్‌వో 9001:20 15 చక్కని విద్య సేవలందిస్తున్నందుకు జెండర్ సెన్సిటైజేషన్ ఆడిట్ సర్టిఫికేషన్, అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ సర్టిఫికేషన్స్ లభించడం అభినందనీయమన్నారు. ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్ పర్యావరణ ప్రభావాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి, వారి పర్యావరణ పనితీరు మెరుగుపరచడానికి సంస్థలకు సహాయ పడుతుందన్నారు. జెండర్ సెన్సిటైజేషన్ ఆడిట్ సర్టిఫికేషన్ సమస్యలను గుర్తించడం పరిష్కరించడం ద్వారా మహిళలకు సురక్షితమైన సమగ్ర వాతావరణం సృష్టించడానికి సంస్థలకు సహాయపడుతుందని తెలిపారు. చక్కని విద్యాసేవలను అందిస్తున్నందుకు, అకడమిక్ అడ్మినిస్ట్రేషన్ సమర్థవంతమైన నిర్వహణకు ఈసర్టిఫికెట్లు ప్రతీకగా ఉంటాయని చెప్పారు. హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి అలపాటి శివయ్య మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలో రెండురోజులు పాటు నిర్వహించిన ఆడిట్ ప్రక్రియకు సంతృప్తి చెందామని, దానికి నిదర్శనంగా ఫైవ్‌స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికెట్ అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఫ్యాకల్టీ అసోసియేట్ ఎస్.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సమగ్ర క్యాన్సర్ చికిత్సకు కొత్త దిశ




రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు

కాకినాడ సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర క్యాన్సర్ చికిత్స సేవలను విస్తరించేందుకు అవసరమైన కేంద్ర సహకారంపై మంగళవారం పార్లమెంట్ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ప్రశ్నించారు. ఆయన ప్రశ్నకు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ స్పందిస్తూ దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న సమగ్ర క్యాన్సర్ కేర్ కార్యక్రమాలు, ఆంధ్రప్రదేశ్‌కు వాటి ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను వివరించారు. ఆధునిక వైద్యం, ఆయుష్ చికిత్సలను కలిపి రోగుల కు సమగ్ర సహాయం అందించే విధానాన్ని కేంద్రం బలంగా ప్రోత్సహిస్తోందన్నారు. ఇందు కోసం కొట్టక్కల్ అయుర్వేద వైద్యశాల, ముంబై లోని టాటా మెమోరియల్‌లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఏఐఐఏ-ఏఐఔఎంఎస్ ఝూజ్జర్, గోవా మెడికల్ కాలేజీలలో సంయుక్త పరిశోధన యూనిట్లు పని చేస్తున్నాయని వివరించారు. 2017-20 మధ్య కృష్ణా జిల్లాలో అమలు చేసిన సీసీఆర్‌హెచ్- డీజీహెచ్‌ఎస్ పైలట్ ప్రాజెక్టు హోమియోపతి, యోగా పద్ధతులను అనుసరించి క్యాన్సర్ రోగులకు సాయం అందించిందని, ఈ ప్రాజెక్టు ఏపీలో సమగ్ర చికిత్సకు మంచి పునాది వేసిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. దీనిపై ఎంపీ సతీష్‌బాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో ఆరోగ్య రంగంలో సమగ్ర వైద్య విధానాలపై తీసుకుంటున్న చర్యలకు అనుకూలంగా కేంద్రం ఇచ్చిన సమాధానం రాష్ట్రంలో సమగ్ర క్యాన్సర్ చికిత్సకు కొత్త దిశ కానుందన్నారు. రాష్ట్రంలో మరిన్ని జిల్లాలకు సమగ్ర క్యాన్సర్ చికిత్స సౌకర్యాలను విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. సమగ్ర వైద్యం రోగుల ఆరోగ్యానికే మాత్రమే కాకుండా, కుటుంబాలకు ధైర్యం ఇస్తుందన్నారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సమన్వయం కొనసాగిస్తానని ఎంపీ సతీష్‌బాబు వెల్లడించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను



\- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహరాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

\- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాధరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథ నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ



రణ్‌వీర్ క్షమాపణలు

కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజీతో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యథార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.



అన్నవరం ఆలయ ప్రాంగణంలో సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

భక్తులకు విజ్ఞప్తి...

- అన్నవరం దేవస్థానంలో సేవలు, వ్రతాల టిక్కెట్ల ఆన్‌లైన్ విధానంపై విస్తృత ప్రచారం
- ముఖ్య ప్రదేశాల్లో సైన్‌బోర్డులు
- ప్రజలకు తగ్గనున్న నిరీక్షణ

అన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలు, దేవదాయశాఖ సూచనలతో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ బుకింగ్, దర్శనాలు, వసతి, ప్రసాదం ప్యాకెట్ల కొనుగోలు తదితర అంశాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. దేవదాయశాఖలో కేవలం 2శాతం మంది మా త్రమే ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుంటున్నారని సర్వేలో తేలడంతో అధికశాతం భక్తుల దర్శనాలు, ప్రసాదాల కొనుగోలు వద్ద, వసతి కేటాయింపు సమయంలో అధికసమయం నిరీక్షణ చేస్తుండడంతో అంతా ఆన్‌లైన్ విధానం తీసుకువచ్చారు. దీనిని విస్తృతంగా భక్తుల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యతను ఆయా దేవస్థానాలకు అప్పగించింది. దీంతో అన్నవరం ఆలయ ప్రాంగణంలో ముఖ్యప్రదేశాలు, ఇతర ప్రాంతాలతో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం తోపాటుగా ఉద్యోగులు తమ ఫోన్లలో స్టేటస్‌లలో పెడుతున్నారు. భక్తులు ఆన్‌లైన్ విధానం సద్వినియోగం చేసుకుంటే నిరీక్షణ సమయం చాలా తగ్గుతుందని అధికారులు తెలిపారు.

అంతర్వేదిలో కూడా..

అంతర్వేది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఆదేశాల మేరకు కమిషనర్ సూచనలు అనుసరించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవస్థానానికి సంబంధించి వసతి గదులు, దర్శనాలు, అభిషేకం, సుదర్శన హోమం, ఇతర సేవల బుకింగ్‌లు, ప్రసాదం టోకెన్ల విక్రయాలు ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆన్‌లైన్ ద్వారా వివిధ సేవలు, దర్శనాల టిక్కెట్లను బుక్ చేసుకునే విధానంలో వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఏపీటెంపుల్స్ ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆలయంలో జరిగే సేవలను ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. అన్నదాన, గోసంరక్షణ వంటి పథకానికి విరాళాలు, క్రెడిట్, డెబిట్ కార్డులు, గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, భీమ్ యూపీఐ ద్వారా చెల్లించవచ్చని చెప్పారు.

శివాలయంలో నాగుపాము ప్రత్యక్షం



చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

రౌతులపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడిలోని పురాతన శివాలయంలో మంగళవారం నాగుపాము ప్రత్యక్షమైంది. శివలింగం దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నించింది. తలుపులు వేసి ఉండడంతో వెనుదిరిగి నందీశ్వరుడి వద్ద సుమారు 3 గంటలసేపు ఉం డిపోయింది. విషయం తెలిసి గ్రామస్తులు నాగుపామును చూసేందుకు తరలివచ్చారు. వారు చూస్తుండగానే గుడి వెనుక నుంచి వెళ్లిపోయింది.



పగడ విప్పి ఉన్న నాగుపాము, చూస్తున్న ప్రజలు

సాగుకు సంరక్షణ ఏది?

జీడిమామిడిని సంరక్షించుకోలేని దుస్థితిలో గిరిజనం

యంత్రాలూ, స్ప్రేయర్లు, ఉపకరణాలు కొనుగోలు చేయడానికి ఇబ్బందులు

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

రంప మన్యంలోని గిరిజనం తమ సాంప్రదాయ జీడిమామిడి సాగును సంరక్షించుకోలేని దుస్థితిలో ఉన్నారు. మన్యం 12 మండలాల్లో సుమారు 50 వేలకుపైగా ఎకరాల్లో జీడిమామిడి సాగును గిరిజనులు కొనసాగిస్తున్నారు. అయి తే జీడిమామిడికి పట్టే తెగుళ్లను నివారించుకోవడంలో సాయం అందక, తమ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక ఇక్కడ జీడిమామిడి రైతాంగం నిర్దిష్టమైన ఆదాయాన్ని పొందలేకపోతున్నారు. దీంతో ఈ జీడిమామిడి తోటలను సొంత ఖర్చులతో నిర్వహించుకునే స్థోమత లేక ఇతరులకు తోటలను లీజులకు ఇచ్చేసి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల కోసం వెతుకులాడుతున్నారు. మరికొందరైతే జీడిమామిడి పిక్కల కొనుగోలుదార్ల నుంచి అడ్వాన్సులు తీసుకుని పంటను సంరక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆనక పంట చేతికి వచ్చాక కొనగోలుదారులు ఇచ్చిన అడ్వాన్సుకు వడ్డీతో కలిపితే రైతుల చేతులకు వచ్చేది శూన్యంగా ఉంటోంది.



తెగుళ్ల బెడద...

ప్రస్తుతం మన్యంలో జీడిమామిడి తోటలన్నీ పువ్వులుతొడిగి పరిపక్వానికి సిద్ధమవుతున్నాయి. శీతాకాలం కావడంతో తేనె మంచు తెగులు, ఇతర తెగుళ్లు పడుతుండగా మరోపక్క కోతుల బెడద కూడా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తోంది. తెగుళ్లకు మందులను, వాటిని పిచికారీ చేసుకోవడానికి యంత్రాలూ, స్ప్రేయర్లు, ఇతర ఉపకరణాలను కొనుగోలు చేసుకోలేక దిక్కుతోచని స్థితిలో గిరిజనులు నలిగిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ఇదే దుస్థితిని ఎదు ర్కొన్నారు. కూటి ప్రభుత్వం పాలనలో ఏడాదిన్నర గడిచినా అధికారుల తీరులో మార్పు లేదు. ప్రభుత్వం రైతాంగానికి అన్ని విధాలా సహకరించాలని స్పష్టం చేస్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. వీరికి అవసరమైన సాయాన్ని అందించే సానుకూల పరిస్థితులు లేక, జీడిమామిడి తోటలకు పడుతున్న తెగుళ్లను కూడా నివారించలేకపోతున్నారు. ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం గుర్తించి తమను ఆదుకుని జీడిమామిడి తోటలను కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు.

వైద్యం అందలేదు.. ప్రాణం ఆగలేదు!

- హోటల్ కార్మికుడికి గుండె నొప్పి
- చేబ్రోలు పీహెచ్‌సీకి తాళాలు
- 108 వచ్చేసరికే మృతి

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 24గంటలు వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళాలు వేసి ఉండడంతో సకాలంలో వైద్యం అందక వ్యక్తి మరణించిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం జరిగింది. దీంతో పీహెచ్‌సీ వైద్యుడిని సస్పెండ్ చేయగా, స్టాఫ్‌నర్సుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

చేబ్రోలు గ్రామంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న శరభవరం గ్రామానికి చెందిన ఇమ్మంది మాణిక్యం(56) తెల్లవారుజామున 2గంటల సమయంలో గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పడంతో చేబ్రోలు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అయితే పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడంతో సిబ్బంది ఎవ్వరు లేరు. దీంతో 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేయగా గంట తర్వాత వచ్చింది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. 24గంటలు పనిచేయాల్సిన పీహెచ్‌సీ మూసి ఉండడంతోనే వైద్యం అందక మాణిక్యం మరణించినట్లు స్థానికులు తెలిపారు. ఇక్కడ పనిచేసే సిబ్బందిలో నలుగురిని ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్ వేయడంతో పాటు వైద్యుల్లో ఒకరు సెలవులో ఉండడంతో పీహెచ్‌సీలో ఎవ రు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడినట్లు వా రు చెప్పారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే ఒకరు మరణించినట్లు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, టీడీపీ నాయకుడు బత్తుల శ్రీను ఆరోపించారు. మరోవైపు టీడీపీ, జనసేన నాయకులు పీహెచ్‌సీని పరిశీలించారు.



మరణించిన మాణిక్యం



తాళాలు వేసి ఉన్న చేబ్రోలు పీహెచ్‌సీ

డీఎంహెచ్‌వో విచారణ

వైద్యం అందక వ్యక్తి మరణించిన సంఘటనపై జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయ అధికారులు ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహనాయక్ చేబ్రోలు చేరుకుని విచారణ చేపట్టారు. ఆరునెలల నుంచి సిబ్బంది కొరతపై ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించలేదని గ్రామస్తులు ప్రశ్నించారు. పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యాధికారి సస్పెన్షన్

పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడం, వైద్యం అందక వ్యక్తి మరణించిన సంఘటనలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిరతన్‌ను డ్యూటీ రోస్టర్ వేయడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందులకు గానూ సస్పెండ్ చేసినట్టు డీఎంహెచ్‌వో మంగళవారం రాత్రి తెలిపారు. అదేవిధంగా స్టాఫ్‌నర్సుకు షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు. ఇద్దరు వైద్యులకు గానూ ఒక వైద్యుడు డాక్టర్ వి.నిఖిల్ సెలవులో ఉన్నట్లు చెప్పారు. డిప్యూటేషన్‌పై ఉన్న స్టాఫ్‌నర్సును తక్షణం చేబ్రోలులో రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పీహెచ్‌సీలో వైద్యసేవలు అందించేందుకు తాళ్లరేవు నుంచి డాక్టర్ ఎల్ సురేష్‌కుమార్ చేబ్రోలుకు డిప్యూటేషన్‌పై నియమించినట్లు చెప్పారు. కాగా సిబ్బంది కొరత, డిప్యూటేషన్లపై ఫిర్యాదు చేసినా ఆరునెలలుగా స్పందించని జిల్లా అధికారులు ఇప్పుడు సంఘటన వెలుగులోకి రాగానే చర్యలు తీసుకోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పీహెచ్‌సీలో విచారణ జరుపుతున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

బంతి తోట తొలగింపు



బంతి తోట తొలగిస్తున్న దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముహూర్తాలు వెళ్లిపోయి మూఢం రావడంతో పూల రైతులు డీలా పడ్డారు. బంతిపూల రేటు కిలో రూ.15కి పడిపోయింది. దీంతో బంతి తోట కొనసాగిస్తే మరింత నష్టాలు వస్తాయనే ఉద్దేశంతో తొలగించి చామంతి వేయడానికి సిద్ధమవుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి చెందిన బండారు నారాయణ ఇదే చేశాడు. ట్రాక్టర్‌తో తన బంతి పంటను తొలగించాడు. ఆ దృశ్యమే ఇది.

కాంగ్రెస్‌కు కొండేటి చిట్టిబాబు రాజీనామా



చిట్టిబాబు

పి.గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామ చేసినట్లు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు వివరాలను ఫోన్‌లో విలేకర్లకు వెల్లడించారు. గతనెల 30న తన రాజీనామాను ఏపీసీసీ అధ్య క్షురాలు షర్మిలారెడ్డికి పంపించానని తెలిపారు. ఇప్పటివరకు పార్టీలో సేవలందించేందుకు సహకరించిన కాంగ్రెస్ పెద్దలు, ఏపీసీసీ అధ్యక్షురాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు. అలాగే కోనసీమ జిల్లాలో 7 నియోజకర్గాల ఇంచార్జ్‌లు, నాయకులు, కార్యకర్త లకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన ఏ పార్టీలో చేరబో తున్నానో త్వరలో ప్రకటిస్తానని స్పష్టం చేశారు. చిట్టిబాబు కాంగ్రెస్‌పార్టీతో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అనంతరం వైసీపీ ఆవిర్భావం నుంచి వైసీపీలో ఉంటూ 2019-24 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2024లో వైసీసీ నుంచి సీటు దక్కకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ నుంచే ఎమ్మెల్యేగా బరిలో నిలబడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి కూడా రాజీనామా చేశారు. అయితే ఆయన కూటమి ప్రభుత్వం వైపు చూస్తున్నారని, త్వరలో టీడీపీ అధినాయకుడు సమక్షంలో ఆ పార్టీలో చేరబోతున్నట్టు జోరుగా ప్రచారం సాగుతుంది.

విద్యార్థుల పట్ల కులవివక్షత...

ముగ్గురు ఉపాధ్యాయులపై బదిలీవేటు

కొత్తపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల కులవివక్షత చూపుతున్నారనే కారణాలతో ముగ్గురు ఉపాధ్యాయులపై విద్యాశాఖాధికారులు బదిలీవేటు వేశారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విద్యార్థుల పట్ల కులవివక్షత చూపుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చేపట్టడం విదితమే. ఈ నేపథ్యంలో యండపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విచారణ నిర్వహించి ముగ్గురు ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి హెచ్‌ఎమ్ జి.సురేష్ భూషణంను శంఖవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ఆంగ్ల ఉపాధ్యాయుడు బి.శ్రీనుబాబును కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు బి.ప్రసాదరావును రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ చేసినట్టు ఎంఈవోలు వేణుగోపాల్, పైడిరాజు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

కాజులూరు (కరప), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం దుగ్గుదుర్రు గ్రామానికి చెందిన కౌలు రైతు కొప్పిశెట్టి అన్నవరం (67) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసుల సమాచారం మేరకు.. దుగ్గుదుర్రులో మూడున్నర ఎకరాల పొలాన్ని అన్నవరం గత కొన్నేళ్లుగా కౌలుకు సాగుచేస్తున్నాడు. ఆదివారం పొలానికి వెళ్లిన అన్నవరం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబసభ్యులు ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం సాగుచేస్తున్న పొలానికి సమీపంలోని ఒక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తుప్పల్లో అతడి మృతదేహాన్ని గుర్తించారు. అన్నవరం ఒంటికి విద్యుత్ వైర్లు చుట్టుకుని ఉండడంతో విద్యుద్ఘాతం వల్లే మృతిచెందినట్టు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న గొల్లపాలెం ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్, ట్రాన్స్‌కో, రెవెన్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

రంగంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం రామేశంపేటలో జరిగింది. ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రామేశంపేటకు చెందిన పిల్లల తాతబ్బాయి (51) తన ఇంటిపై రెండోఫ్లోర్ నిర్మిస్తున్నాడు. ఆ పనులు ఎంతవరకు వచ్చాయో చూద్దామని మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటిపైకి వెళ్లి పిట్టగోడ దగ్గర నుంచి పరిశీలిస్తుండగా పిట్టగోడ పక్క నుంచి వెళ్తున్న కరెంట్‌తీగ తగిలి షాక్‌తో అక్కడికక్కడే మరణించాడు. అతడి కుమారుడు కిషోర్ ఇచ్చినఫిర్యాదుతో ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ద్రాక్షారామ, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వర థియేటర్ కాంప్లెక్సు ఎదురుగా అరుగుపై మంగళవారం ఉదయం సుమారు 70 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. అతడు గత 20 ఏళ్లుగా చిత్తుకాగితాలు ఏరుకుంటూ, భిక్షమెత్తుకు జీవిస్తున్నాడని స్థానికులు చెప్పారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచాయతీ సహకారంతో శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

పంటకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కిర్లంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనే పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి వేలంక వీఆర్వోకు తెలిపారు. ఆయన కిర్లంపూడి పోలీసులకు సమాచారం అందించారు. కిర్లంపూడి హెడ్ కానిస్టేబుల్ ఎవి.మూర్తి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పంటకాలువలో ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేనివిధంగా చేరుకుంది. మృతుడి వయసు సమారు 45ఏళ్లు ఉంటుంది.. మృతదేహంపై బ్లూ టీ షర్టు, షార్ట్ ఉన్నాయి. ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించామని, స మాచారం తెలిసిన వారు జగ్గంపేట సీఐ నెంబర్ 9440796529, కిర్లంపూడి ఎస్‌ఐ సతీష్ 9440904834 నెంబర్‌లకు సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు

ద్రాక్షారామ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ నున్నవారి వీధికి చెందిన పలివెలి సావిత్రి (30), తన చిన్నకుమార్తె పూర్ణసాయిక్షిత(7)తో కలసి అదృశ్యమైనట్టు భర్త పలివెల జ్యోతిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఏఎస్‌ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జ్యోతిబాబు సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఇంటికి కిరాణా సరుకులు తీసుకెళ్లగా సావిత్రి మరికొన్ని సామన్లు తేవాలని కోరింది. జ్యోతిబాబు ఒకేసారి తీసుకురమ్మని చెప్పవచ్చుగా అని కేకలు వేసి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి వచ్చేసరికి సావిత్రి, చిన్న కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల వారిని అడుగగా చిన్న కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయిందని చెప్పారు. దీంతో జ్యోతిబాబు అత్తగారికి ఫోన్ చేయగా తమ ఇంటికి రాలేదని చెప్పారు. బంధువుల ఇంట్లో గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో ద్రాక్షారామ పోలీసులకు జ్యోతిబాబు ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు.

అన్నివర్గాలకు ఎస్సీ వర్గీకరణ ఫలాలు

మాదిగ అనుబంధ కులాలకు కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాల సేవలు చిరస్మరణీయం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



నడిపూడిలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

అమలాపురం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలను అన్నివర్గాల వారు అనుభవించాలని రాజ్యాంగపరంగా నిర్దిష్టంగా ఉందని అందుకే అత్యున్నత న్యాయస్థానం సైతం మాదిగ అనుబంధ కులాలకు న్యాయం చేసేలా తీర్పు ఇచ్చిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలను ప్రతీ ఒక్కరు అనుభవిస్తూ ఇతర వర్గాలవారితో పోటీపడుతూ అవసరమైతే జనరల్ కేటగిరిలో సైతం ఆధికత్యను సాధించి గొప్పవారిగా నిలవడమే రాజ్యాంగ లక్ష్యమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మంగళవారం జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన భారీ ర్యాలీగా పురవీధుల మీదుగా నడిపూడిలోని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాస్థాయి మాదిగ అనుబంధసంఘాల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ బద్ధమైన హక్కులను జాతీయస్థాయిలో పొందడానికి దశాబ్దాలు పట్టాయని వివరించారు. వర్గీకరణ ఫలితాలు పొందుతూనే చదువుల్లో ప్రతీ మాదిగ బిడ్డ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా ఇన్‌చార్జి స్వామాట్ కేబీ మధుమాదిగ అధ్యక్షతన ఉమ్మడి జిల్లాల ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల సమావేశం మంగళవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ అనుబంధ కులాలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అనుకూలంగా ఎవరు ఉన్నారు, వ్యతిరేకంగా ఎవరు వ్యవహరిస్తున్నారు గుర్తించాలని సూచించారు. తొలుత ముక్కామల సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తొత్తరమూడి గోవిందు మందకృష్ణకు భారీ గజమాలతో స్వాగతం పలికారు. సమావేశంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మున్నంగి నాగరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్, జాతీయ నాయకులు డాక్టర్ దూళ్లపల్లి సుబ్బారావు మాదిగ, పేరెల్లి ఎలీషా మాదిగ, జిల్లా ఇన్‌చార్జి పి.మధు, ఇన్‌చార్జి డాన్ సూరిమాదిగ, జాతీయ నాయకులు ముమ్మిడివరపు చినసుబ్బారావు, ఉందుర్తి వెంకట్రావు, రాజమహేంద్రవరం, కాకినాడ, కోనసీమ ఇన్‌చార్జిలతో పాటు నాయకులు ఆకుమర్తి రమేష్, డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు, డైరెక్టర్లు తొత్తరమూడి ప్రభాకరరావు, చాట్ల సత్యనారాయణ, కాప నాగభూషణం, మండ వెంకటేశ్వరరావు, కొడమంచిలి సాయికుమార్, ఈతకోట రాజు పాల్గొన్నారు.

వాటర్ కండక్టర్ సిస్టం పనులకు

నీటి విడుదల నిలిపివేశాం

సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు



పూజలు చేసి కొబ్బరికాయ కొడుతున్న సీఈ రాజారావు

మోతుగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 5,6 యూనిట్లకు పెన్‌స్టాక్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు పంపించే క్రమంలో వాటర్ కండక్టర్ సిస్టం పనులను ప్రారంభించడానికి మంగళవారం ఉదయం నుంచి డొంకరాయి నుంచి కెనాల్ నీటి విడుదలను నిలిపివేశామని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు పేర్కొన్నారు. ఫోర్‌బై ఇంటెక్ డ్యాం వద్ద జాన్ అండర్ వాటర్ డైవింగ్ బృందంతో గేట్లను దించి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టామన్నారు. ఇంటెక్ డ్యాం దిగువన ఉన్న 5.5 కిలోమీటర్ల పొడవున గల టన్నెల్ గేట్లను కూడా అండర్ వాటర్ డ్రైవింగ్ బృందం దించిన తరువాత లీకేజీలు లేకుండా సీల్ వేస్తారని, అనంతం టన్నెల వద్ద అవుట్ లెట్ నుంచి 5,6 యూనిట్లకు నీరు పంపించడానికి అవసరమైన కండక్టర్ సిస్టం పనులు పనులు ప్రారంభించడానికి పీఈఎస్ కంపెనీ ఏర్పాట్లను చేసుకుంటున్నారని తెలిపారు. ఇంటెక్ డ్యాం వద్ద మెదటిగా సీఈ రాజారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో విజయవాడ విద్యుత్ సౌదా హైడల్ సీఈ రవీం ద్రరెడ్డి, ఎస్‌ఈలు (సివిల్) శ్రీనివాసరెడ్డి, చిన్నకా మేశ్వరరావు, ఈఈలు బాలకృష్ణ, నాగశ్రీనివాస రావు పాల్గొన్నారు.

నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

పొల్లూరు 5,6 యూనిట్లకు నీటి సరఫరా పనులకు కెనాల్ నుంచి నీటి విడుదలను నిలిపివేయడంతో మంగళవారం ఉదయం నుంచి పొల్లూరు, డొంకచాయి జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు.

గడవాలి పూట.. తప్పదు వేట..



దిత్వా తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గనేలేదు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో ఈదురుగాలులు వీస్తూనే ఉన్నాయి. చిరుజల్లులు కురుస్తున్నాయి. సముద్రం ఒక మోస్తరు అల్లకల్లోలంగా ఉంది. ఎన్ని ఇబ్బందులున్నా తగ్గేదేలే అంటూ తీరప్రాంతానికి చెందిన మత్స్యకారులు మంగళవారం ఉదయం సముద్రంలోకి వేటకు వెళ్లారు. ప్రతికూల వాతావరణం ఉన్నా పర్వాలేదు ఎంతోకొంత ఆదాయం వస్తే తమకు రోజు గడుస్తుందని చెప్పున్నారు. – కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

ఆహ్లాదకరంగా రెండో రోజు స్కేటింగ్ పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వివేకానంద పార్క్ ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో 69వ అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్షిప్ అండర్ 11, 14, 17,19 క్యాటగిరీలలో టోర్నమెంట్ కం సెలెక్షన్స్ పోటీలు రెండో రోజు మంగళవారం ఆహ్లాదకరంగా సాగాయి. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ అడ్మిన్ సెక్రటరీ పి.సుధారిణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, చీఫ్ గెస్ట్‌గా ఐపి మహబూబ్ బాషా, కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ పి.రవిచంద్ర విజేతలకు మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో లంక జార్జ్, రాష్ట్ర హాకీ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి వి.రవి రాజ్ పాల్గొన్నారు.



స్కేటింగ్ చేస్తున్న బాలలు

ఉత్సవ్ పోటీల్లో సాయికి ద్వితీయ స్థానం

అంబాజీపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భగవద్గీత జయంతి ఉత్సవం సందర్భంగా జరిగిన సంస్కృతి ఉత్సవ్ 2025 భగవద్గీత కంఠస్థ పోటీల్లో అంబాజీపేట జడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని బండారు డింపిల్ సాయివరలక్ష్మి ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకాన్ని అందుకున్నట్లు హెచ్ఎం కె.సాయిరాం తెలిపారు.

తిరగబడిన లారీ



ముమ్మిడివరం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మహిపాలచెరువు సమీపంలో మంగళవారం కాంక్రీటు మిక్సింగ్ లారీ అదుపుతప్పి తిరగబడింది. దీంతో స్థానికుల సాయంతో హైడ్రాలిక్‌తో లారీని తిరిగి నిలబెట్టారు.

ఉపాధి హామీలో 'క్లియరెన్స్' ప్లీజ్...

- జంగిల్ క్లియరెన్స్ పునరుద్ధరణకు ప్రజాప్రతినిధుల వినతి
- అధ్వానంగా రహదారులు
- పూడుకు పోతున్న పంట కాల్వలు
- ఆర్థిక స్తోమత సరిపోదంటున్న నీటి సంఘాలు

ఉప్పలగుప్తం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గతంలో రహదారుల వెంబడి ఇరువైపుల తుప్పలు, మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించేవారు. దీని కోసం ప్రత్యేకంగా ఉద్యోగులు ఉండేవారు. ఆర్అండ్‌బీ రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్‌కు మైలు కూలీ వ్యవస్థ ఉండేది. ఈకారణంగా రహదారులు ఇరువైపులా క్లియర్‌గా ఉండి ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేది. అలాగే పంటకాల్వల్లో పూడికతీత, గట్లపై ఉన్న తుప్పలను తొలగించేందుకు లస్కర్ వ్యవస్థ ఉండేది. లస్కర్లు, రైతులు పరస్పర సహకారంతో పంటకాల్వలు ఎంతో పరిశుభ్రంగా ఉండేవి. అనంతరం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జంగిల్ క్లియరెన్స్ ప్రవేశపెట్టారు. ఫలితంగా పంటకాల్వల్లో పూడికతీత పనులు, కాల్వ గట్లపై పెరిగే మొక్కలు, తుప్పలు తొలగింపు ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయి. రహదారులకు ఇరువైపుల మొక్కలను, తుప్పలను జంగిల్ క్లియరెన్స్‌లో తొలగించడంతో రహదారులు రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటున్నాయి. అంతా సజావుగా జరుగుతున్న సమయంలో ఉపాధి పథకం పనుల జాబితాలో జంగిల్ క్లియరెన్స్‌ను తొలగించారు. దీంతో పంటకాల్వలు తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయి నీటి ప్రవాహానికి అంతరాయం కలిగి శివారు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇక రహదారుల మాట చెప్పనక్కర్లేదు. ఇరువైపులా తుప్పలు పెరిగి రహదారులు క్రమంగా ఇరుకు దారులుగా మారుతున్నాయి. పంటకాల్వల్లో పూడిక తియ్యాలంటే తమకు సరిపడే బడ్జెట్ లేదని నీటి సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చేపట్టిన అమలాపురం- చల్లపల్లి ప్రధాన పంటకాల్వ పూడికతీత పనులకు రూ.5లక్షలు వ్యయం కాగా బడ్జెట్ మాత్రం రూ.1.80లక్షలేనని ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబు తెలిపారు. నీటిసంఘాల పరిధిలోను ఇదే పరిస్థితిని ఎదుర్కుంటున్నట్టు చైర్మన్లు అంటున్నారు. ఇటీవల కేంద్ర బృందం పథకాల అమలు తీరును పరిశీలించేందుకు కోనసీమ వచ్చినప్పుడు జంగిల్ క్లియరెన్స్‌పై రైతులు, ప్రజలు ప్రస్తావించారు. వెంటనే జంగిల్ క్లియరెన్స్ పునరుద్ధరించాలంటూ వినతిపత్రాలు సమర్పించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని శాసనసభ్యులు సైతం జంగిల్ క్లియరెన్స్ ఆవశ్యకతపై తమ వాదన వినిపించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కేంద్ర బృందంతో సమావేశమై ఉపాధి హామీలో జంగిల్ క్లియరెన్స్ జిల్లాకు ఎంత అవసరమో వివరించారు.



గుర్రపుడెక్కతో పూడుకుపోయిన ఎస్.యానాం చెరువుగట్టు పంటకాల్వ



ఇరువైపులా తుప్పలు, మొక్కలతో ఇరుక్కుపోయిన సిరిపల్లి- మునిపల్లి ఆర్అండ్‌బీ రహదారి

జంగిల్ క్లియరెన్స్‌కు పట్టుబడుతున్నాం: గుబ్బల శ్రీనివాస్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్

ఉపాధి హామీ పథకంలో జంగిల్ క్లియరెన్స్‌ను తిరిగి ప్రవేశపెట్టాలని పట్టుబడుతున్నట్టు వాటర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. జిల్లాలో పంటకాల్వలు, డ్రెయిన్లు తరచూ గుర్రపుడెక్క, తూడుతో పూడుకు పోతున్నాయని అన్నారు. జంగిల్ క్లియరెన్స్ ద్వారా చాలా వరకు కాల్వల్లో పూడికతీత పనులు జరిగేవన్నారు. రైతులు కూడా సహకరించడంతో పంటకాల్వలు శుభ్రంగా ఉండేవన్నారు. నిజానికి పంటకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలంటే తగిన బడ్జెట్ నీటి సంఘాలకు అందుబాటులో లేదన్నారు. ప్రస్తుతం దాళ్వా సీజన్ సమీపించడంతో పంటకాల్వల్లో శీఘ్రగతిన పూడికతీతలు చేపట్టవలసి ఉందన్నారు. పూడికతీతలు జరిగితేనే నారుమళ్ళకు నీరందుతున్నారు. జిల్లాలోని శాసనసభ్యులతో పాటు ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీలో జంగిల్ క్లియరెన్స్ పునరుద్ధరించాలని సంబంధిత శాఖను కోరురినట్టు తెలిపారు. వచ్చే ఏడాది జంగిల్ క్లియరెన్స్‌కు క్లియరెన్స్ వస్తుందన్న ఆశాభావంతో ఉన్నామన్నారు.

శంకరగుప్తంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు

- స్థల నిర్ధారణ చేస్తున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తంలో మంగళవారంఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటించి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. 132/33కేవీ సబ్‌స్టేషన్, 33/11 కేవీ సబ్‌స్టేషన్ స్థలాల కోసం అధికారులతో కలిసి పర్యటించారు. పంచాయతీ దగ్గరలో ఉన్న 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ 25ఏళ్ల తరువాత శివకోటిలో 132/33కేవీ సబ్‌స్టేషన్, శంకరగుప్తంలో 132/33కేవీ సబ్‌స్టేషన్ నిర్మించాలని ప్రతిపాదించానని తెలిపారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం ఐదు ఎకరాల అనువైన స్థలాన్ని గుర్తించి, త్వరలో ఏపీ ట్రాన్స్‌కో సంస్థ నుంచి మంజూరు ఉత్తర్వులు వచ్చిన వెంటనే రూ.80కోట్లతో పనులు ప్రారంభమవుతాయన్నారు. గుడిమూలలో నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు ఒకటి గుడిమెళ్లంక, మరొకటి శంకరగుప్తంలో నిర్మించడానికి స్థలాన్ని గుర్తించామన్నారు. రాజోలు నియోజకవర్గంలో 120 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశామని, మరో 200ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తున్నామన్నారు. 11 మీటర్ల స్తంభాలు, ఏబీ కేబుల్ వైర్లు సరిపడా ఏర్పాటు చేసుకుని వచ్చే వేసవికి లోఓల్టేజ్ లేని కరెంటు సరఫరాకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



శంకరగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థల నిర్ధారణ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు అఖిలేష్ శుక్లా

అమలాపురం టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు అఖిలేష్ శుక్లా పేర్కొన్నారు. అమలాపురంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో గతంలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. బ్యాంకుల జాతీయకరణతో సహా ఉపాధిహామీ పథకంతో పాటు ఎన్నో ఘట్టాలను కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని వివరించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ సంస్థాగత అభివృద్ధిపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేటర్ జంగా గౌతమ్, పీసీసీ కొత్తూరి శ్రీనివాస్, ఏఐసీసీ సభ్యులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, పీసీసీ ఇన్‌చార్జిలు మల్లిపూడి రాంబాబు, అరిగెల రమణకుమారి తదితరులు పలు సూచనలు చేశారు. సమావేశంలో నాయకులు వస్కా బాబు, సుగ్గ ప్రసాద్, వంటెద్దు బాబి, మాచవరపు శివన్నారాయణ, మహబూబ్ షకీలా, రాయుడు రమణ, సత్తి బాపూజీ, ఏలేశ్వరపు రాధాకృష్ణపాల్గొన్నారు.

సమరసత సేవా ఫౌండేషన్ వార్షికోత్సవం

ఐ.పోలవరం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సమరసత సేవా ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం మంగళవారం జరుపుకున్నారు. టి.కొత్తపల్లి, పాతయింజరం, కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామాల్లో భజనలు, హారతుల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈసంస్థ ద్వారా ప్రతి పూర్ణిమకు సామూహిక హారతి, రెండో శనివారం సత్సంగం, ఏకాదశికి గ్రామాల్లో నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో టీటీడీ సహకారంతో ఆలయాలు నిర్మిస్తున్నామన్నారు. ముమ్మిడివరం కన్వీనర్ గొలకోటి సాయిబాబు, ధర్మప్రచారక్ బొంతు కనకారావు, దవులూరి వెంకటేశ్వరరావు, కొండేపూడి శ్రీనివాసరావు, బొంతు రామారావు, గంజా భాస్కరలక్ష్మి, పడమట పద్మ, నూలు వల్లితాయారు పాల్గొన్నారు.

ఘనంగా కనకముత్యాలమ్మ జాతర

అంతర్వేది, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం-అంతర్వేది సరిహద్దు గ్రామాల్లో వేంచేసి ఉన్న శ్రీకనకముత్యాలమ్మ, కనకదుర్గమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం వైభవంగా జాతర జరిగింది. అమ్మవారు గరగలతోగ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం బుధవారం సాయంత్రానికి ఆలయానికి చేరుకుని గురువారం ఆలయం వద్ద తీర్థ మహోత్సవాలు, నైవేద్యాలు అమ్మవారికి సమర్పిస్తారు. గురువారం సిరిబొమ్మ ఊరేగింపు, మొక్కులు చెల్లించుకునే భక్తులు ఆలయం వద్ద జరిగే తీర్థమహోత్సవంలోపాల్గొని అమ్మవారినిదర్శించుకుంటారు.

వర్షాలకు రైతుల కుదేలు

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ నేపథ్యంలో రెండు రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చి వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 2700ఎకరాల్లో సార్వా రైతులు వరిసాగు చేశారు. ఇప్పటివరకు 900ఎకరాల్లో రైతులు తమ పంటను ఒబ్బిడి చేసుకున్నారని అధికారులు తెలియజేశారు. కొంత పనల మీద ఉండగా, మరికొంత ధాన్యం కళ్లాల్లో ఉండడంతో వాటిని రక్షించుకునే పనిలో రైతులు ఉన్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పుకుని సంరక్షించుకున్నారు. గత తుఫాన్‌నష్టాల నుంచి ఇంకా గట్టెక్కకముందే దిత్వా తుఫాన్ తమను మరింత నష్టాల్లోకి నెట్టిందని రైతులు వాపోతున్నారు.

యువతకు రాజ్యాంగంపై అవగాహన అవసరం



విద్యార్థినిని అభినందిస్తున్న అతిథులు

యానాం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, పార్లమెంట్ విధానాలు, ప్రజాస్వామ్యంపై యువతకు పూర్తిగా అవగాహన ఉండాలని కళైమమాణి పొనుగుమట్ల విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసభలో విష్ణుమూర్తి కీలక ప్రసంగం చేశారు. రాజ్యాంగంలో ఆర్టికల్స్, రాజ్యాంగం కల్పించిన హక్కులు తదితర అంశాలను వివరించారు. మరో ప్రధానవక్త చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు మాట్లాడుతూ యువత జాతీయ సమస్యలను, పార్లమెంట్ విధి విధానాలను అవగాహన చేసుకోవాలన్నారు. అనంతరం విశ్రాంతి ప్రిన్సిపాల్ కనకాల రామదాసు, ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి రవిశంకర్, ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ శీలం సూర్యనారాయణ తదితరులు వికసిత్ భారత్ గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఎస్.శ్రీనివాస్, చెల్లి నరేష్, ఎం.శాంతరాజు, డాక్టర్ ముత్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందిపాల్గొన్నారు.

అరటి వ్యాపారులు సహకరించాలి



అంబాజీపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మార్కెట్ యార్డుకు వచ్చే అరటి వ్యాపారులు మార్కెట్ కమిటీ ఉద్యోగులు, సిబ్బందికి సహకరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ కోరారు. స్థానిక మార్కెట్ యార్డులో అరటి వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం అరటి వ్యాపారం నిర్వహించే సమయంలో వ్యాపారులు బయట ఉండిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. మార్కెట్ కమిటీ నిర్ణయించిన ప్రదేశాల్లో వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటం వల్ల ఉదయం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సూచించారు. అరటి వ్యాపారులు, రైతులు సహకరించాలని కోరారు. వైస్‌చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఐ.రమేష్, పాలకవర్గసభ్యులు, అరటి రైతులు పాల్గొన్నారు.

సునీల్‌కుమార్ నోరు అదుపులో ఉంచుకోవాలి

మార్కెటింగ్ మాజీ చైర్మన్ గొలకోటి దొరబాబు

ముమ్మిడివరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాపులకు సీఎం పదవి, దళితులకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సునీల్‌కుమార్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ముమ్మిడివరం మార్కెటింగ్ మాజీ చైర్మన్ గొలకోటి దొరబాబు పేర్కొన్నారు. మంగళవారం దొరబాబు మాట్లాడుతూ సునీల్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై ప్రస్తావిస్తూ ఆయన సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా ఒక రాజకీయ నాయుడిలా మాట్లాడారని విమర్శించారు. ఒక ఉన్నతస్థాయిలో పనిచేసిన అధికారి పదవిలో లేకపోయినా ప్రభుత్వ సర్వీసుకు సంబంధించిన నిబంధనలు పాటించాలని హితవు పలికారు.

నేడు వీరేశ్వరస్వామి హుండీల కానుకల లెక్కింపు

ఐ.పోలవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి హుండీల కానుకల లెక్కింపు బుధవారం నిర్వహిస్తున్నట్టు ఆయ ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు, గ్రామస్తులతో కానుకల లెక్కింపు నిర్వహిస్తామన్నారు.

యూటీఎఫ్ ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అంతర్వేది, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోలా వీరస్వామి ఆవిష్కరించారు. సమ్మిట్-1 పరీక్షల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా అందజేశారు. యూటీఎఫ్ నిర్వహణలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు తయారుచేసిన మోడల్ పేపర్లను ఒక పుస్తకంగా పబ్లిష్‌చేసి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు నల్లి విశ్వనాథం అన్నారు. ఈపుస్తకం పదో తరగతి విద్యార్థులు, మెరిట్ సాధించిన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పి.లీలావతి జ్ఞాపకార్థం పుస్తకాలను ఆమె భర్త కృష్ణ విద్యార్థులకు స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు జి.రాజబాబు, అధ్యక్షుడు పి.సూర్యచంద్రరావు,ప్రధాన కార్యదర్శి గోపిరాజు, యూటీఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్‌కు పూజలు



అమలాపురం టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హనుమద్వ్రత పూజా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి హనుమద్ కల్యాణం అత్యంత వైభవంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రధానంగా అమలాపురం యర్రమిల్లివారివీధిలోని సకల కార్యసిద్ధి మరకత హనుమాన్ మందిర్ వద్ద స్వామివారి కల్యాణాన్ని ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్టు చైర్మన్ ఆకొండి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణం అనంతరం అఖండ అన్నసమారాధ నిర్వహించారు. కార్యక్రమంలో ఆకొండి మహేష్‌శర్మ, దేవపూజ్యుల నాగమణి, ఆకొండి అంజి, వేదనభట్లసాయిలక్ష్మి, ఆకొండి రవీంద్రతో పాటు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



ముమ్మిడివరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 80మంది బాధితులకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు రూ.43.41లక్షలు సీఎం రిలీఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ అమలు కానివారికి సీఎం సహాయనిధి ద్వారా ప్రజలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు.

పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అంతర్వేది, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు లేని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బోధనకు ఆటంకం కలగకుండా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తాత్కాలికంగా నియమించుకునేందుకు అప్పనరామునిలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ హిందీ, అంతర్వేది దేవస్థానం గుండుబోగులవారి గ్రూపు ప్రైమరీ స్కూలులో ఎస్టీటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో డి.కిశోర్‌కుమార్ తెలిపారు. ఎస్ఏకు రూ.12,500, ఎస్టీటీకి రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తారన్నారు. అర్హత కలిగినవారు దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిసెంబరు 4వ తేదీ సాయంత్రం 4గంటలలోపు అందజేయాలని ఎంఈవోలు కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు 2026వరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లగా పనిచేయడానికి నోటిఫికేషన్ విడుదలైందని ఎంఈవో కె.కిరణ్‌బాబు మంగళవారం తెలిపారు. మండలంలో నాలుగు పోస్టులు, సామంతకుర్రు, తుమ్మలపల్లి (తాళ్లచెరువు)పాఠశాలకు ఎస్టీటీలు, కొమరగిరిపట్నం హైస్కూలులో హిందీ, కోడూరుపాడు హైస్కూలులో బయాలజీ పోస్టులు మంజూరయ్యాయని, డిసెంబరు 5లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్టీటీలకు నెలకు రూ.10వేలు, అసిస్టెంట్లకు నెలకు రూ.12వేలు గౌరవ వేతనం ఇస్తారన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఐదు నెలలు హిందీ బోధించేందుకు (ఒక పోస్టు) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు గౌరీశంకర్, ఉదయ్‌భాస్కర్‌లు తెలిపారు. ఈనెల3,4,5 తేదీల్లో 5గంటలలోపు ధ్రువ పత్రాలను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండల పరిధిలో ఎంపీపీఎస్ జీపీ కాలనీ జి.పల్లిపాలెం, నంబరు1 కేశనపల్లి పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎస్టీటీ పోస్టులకు, జడ్పీహెచ్ఎస్ బట్టేలంక పాఠశాలలో ఎస్ఏ హిందీ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లగా డిసెంబరు 8నుంచి మే7వ తేదీ 2026 వరకు ఐదు నెలలు పనిచేయడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ఎంఈవో తెలిపారు. ఎస్టీటీ పోస్టులకు నెలకు రూ.10వేలు, స్కూలు అసిస్టెంట్లకుకు నెలకు రూ.12500 గౌరవ వేతనం ఇస్తామన్నారు. దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిసెంబరు 5వతేదీలోగా అందించాలన్నారు. మండలానికి చెందిన వారికి మాత్రమే మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పొన్నమండ సబ్‌స్టేషన్ పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. మండలంలో మగటపల్లి, కొమరాడ, గోగన్నమఠం, ఆదుర్రు, లూటుకుర్రు గ్రామాలు, రాజోలు మండలం పొన్నమండ, చింతలపల్లి, కాట్రేనిపాడు, మెరకపాలెం, కూనవరం, ములికిపల్లి గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాజోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. మంగళవారం శివకోడులో రైతులకు విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందడానికి పార్టీలకు అతీతంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సర్పంచ్ నక్కారామారావు, ఎంపీటీసీలు ఉండ్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావు, సొసైటీ చైర్మన్ కసుకుర్తి త్రినాథస్వామి, పినిశెట్టి బుజ్జి, మెరుగుమువ్వల సత్యవరప్రసాద్, కడలి నాగేశ్వరరావు, బోళ్ల రాంబాబు, ఆరుమల్లి భాను పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఉప్పలగుప్తం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని గుడ్‌సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు అన్నారు. విద్యార్జనకు పేదరికం అడ్డురాకూడదనే లక్ష్యంతో పేద విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరులో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన కొడమంచిలి కృపావతికి మంగళవారం ఆయన రూ.25 వేలు సహాయం అందించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరుతూ మామిడికుదురు దీప్తి స్కూలు విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంలో భాగంగా కాలుష్యాన్ని నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ప్లకార్డులతో ర్యాలీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని స్కూలు కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ సూచించారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన బాధితుల జ్ఞాపకార్థం ఈదినోత్సవాన్ని దేశంలో జరుపుకుంటున్నారు.

రక్షణ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో చట్టాల ద్వారా నిందితులకు కఠినమైన శిక్షలు ఉంటాయని ఎస్ఐ బి.సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం అల్లవరం జడ్పీ హైస్కూలులో మహిళా సంరక్షణపై ఎంపీపీ యిళ్ల శేషారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు సోషల్ మీడియాలో ఫొటోలు, పోస్టులు పెట్టవద్దని, అవి పెట్టేముందు క్షణం ఆలోచించుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా ఎస్ఐపే సన్మానించారు. హెచ్ఎం ఎన్.వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీదుర్గారావు, సర్పంచ్‌లు సాధనాల వెంకట్రావు, తోట శ్రీదేవి నరసింహారావు, గెడ్డం విజయకుమార్, మంగం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న అతిథులు

యానాం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రాంతీయ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈప్రదర్శనను యానాం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి, ఆరోగ్యశాఖ డీడీ డాక్టర్ టి.రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ అందంకి మల్లికార్జునరావు, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ ప్రారంభించారు. యానాం విద్యా శాఖ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నాలుగు విభాగాల్లో ప్రదర్శనలు ప్రదర్శించారు. గురువారం వరకు ఈప్రదర్శనలు కొనసాగనున్నాయి. ఈప్రదర్శనలో ప్రతిభ సాధించిన వారు పుదుచ్చేరిలో డిసెంబరు 7,8వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెలయేరు పుస్తకావిష్కరణ

అయినవిల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నేటి సెల్‌ఫోన్ యుగంలో బాలలకు ఉపయోగపడే కథలు, కవితలను పుస్తక రూపంలో బాలల పత్రికను రూపొందించడం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెలయేరు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సెలయేరు పుస్తకాన్ని రూపొందించిన ఉపాధ్యాయుడు మామిడిశెట్టి బాలాజీని డీఈవో అభినందించారు. కార్యక్రమంలో అమలాపురం, రామచంద్రపురం డీవైఈవోలు సూర్యప్రకాష్, బి.రామలక్ష్మణమూర్తి, డీసీఈబీ సెక్రటరీ, ఏసీ బి.హనుమంతరావు, అయినవిల్లి ఎంఈవో పి.శ్రీనివాస్, నేదునూరు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఎం.ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లిఖిత్‌కు ఆకెళ్ల రాఘవేంద్ర అభినందన

అంబాజీపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): లీడ్ ఐఏఎస్ సంస్థ నిర్వహించిన ప్రపంచ స్థాయి మాక్ ఐఏఎస్ పోటీ పరీక్షల్లో జూనియర్ విభాగంలో అంబాజీపేటకు చెందిన నేలపూడి లిఖిత్‌కార్తీకేయ ప్రథమ స్థానంలో నిలిచాడు. ప్రముఖ సివిల్ సర్వీస్ శిక్షకుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర కార్తీకేయను హైదరాబాద్‌లో అభినందించారు. పట్టుదలతో కృషిచేస్తే సాధించలేని లక్ష్యం ఏదీలేదని రాఘవేంద్ర అన్నారు.



రాఘవేంద్ర నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న లిఖిత్

బేస్‌బాల్ స్టేట్ మీట్‌లో సాయిలక్ష్మికి కాంస్యం



సత్యసాయిలక్ష్మి, గొల్లవిల్లి హైస్కూల్ హెచ్ఎం కనకదుర్గ, పీడీ సరస్వతి

ఉప్పలగుప్తం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన అండర్-14 బేస్‌బాల్ స్టేట్ మీట్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈజట్టులో పాల్గొని ప్రతిభ కనబరిచిన గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని అరవ సత్యసాయిలక్ష్మి కాంస్య పతకం సాధించింది. హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ, పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, పీడీలు గొలకోటి ఫణీంద్రకుమార్, డి.సరస్వతి, గ్రామ పెద్దలు సాయిలక్ష్మిని అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాజోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో ప్రజలు అనేక వ్యాధుల బారిన పడతారని, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాటిపాక పీహెచ్‌సీ వైద్యుడు ఫణికిరణ్ తెలిపారు. కలుషితమైన నీరు తాగడం, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నా అటువంటి ప్రదేశాల్లో దోమలు విపరీతంగా పెరుగుతాయని, దీంతో ప్రజలు రోగాల బారిన పడతారని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీల సిబ్బందితో ప్రతీరోజు నీటి నిల్వలు ఉన్నచోట గంబూజియా చేపలను వదులుతున్నామని, ఈ చేప దోమ లార్వాను నివారిస్తుందన్నారు. అంతేకాకుండా ప్రతీ వారం ఫ్రైడేను డ్రైడేగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల కాలంలో తాటిపాక పీహెచ్‌సీకి పలువురు వైరల్‌జ్వరాలతో వచ్చిన రోగులకు మందులు ఇవ్వడంతో పూర్తిగి తగ్గిపోయినట్టు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో డయేరియా, మలేరియా, డెంగ్యూ, కలరా, టైఫాయిడ్ రోగులుఎవరూ లేరని తెలిపారు. రాజోలు పీహెచ్‌సీ పరిధిలో రోగులు వైరల్ జ్వరాలతో రాగా వారికి నయమైనట్టు తెలిపారు.

ప్రతీ నిరుపేదకు అండగా ప్రభుత్వం



పి.గన్నవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్య నారాయణ అన్నారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో మంగళవారం 50మందికి రూ.41,53,133 సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఇప్పటివరకు 650మందికి రూ.5.26కోట్లు అందించామన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, దాసరి వీరవెంకటసత్యనారాయణ, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, జాలెం శ్రీనివా సరాజా, తోలేటి నారాయణమూర్తి, నాగాబత్తుల సుబ్బారావు, తాటికాయల శ్రీనివాసరావు, పులపర్తి సూజాత, కోట రాజేంద్రప్రసాద్, యల్లమిల్లి చిట్టిబాబు, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా తిరునక్షత్ర పూజలు

ఆత్రేయపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఆలయంలో తిరునక్షత్ర వేడుకల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం ఆళ్వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాకాలం, ద్రవిడ వేద పారాయణ, పల్లకీ మహోత్సవం తదితర కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు.

పాణింగపల్లి పాఠశాల తనిఖీ

కె.గంగవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాణింగపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం బొమ్మూరు డైట్ లెక్చరర్ కె.శ్రీకృష్ణ సాయి పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న జీ-ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను పరిశీలించారు. ఆయా రికార్డులను ఆయన పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం మంత్రి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కె.గంగవరం సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, రామచంద్రపురం మండలం అన్నాయిపేటకు చెందిన బి.అబ్బాయినాయుడు, 25 మంది కార్యకర్తలు ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ సారథ్యంలో మంత్రి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి మంత్రి సుభాష్ పార్టీకండువాలు వేసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ పాలన, మంత్రి సుభాష్ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి టీడీపీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం, బీసీ సెల్ నాయకుడు పెంకె సాంబశివరావు, ఆకుల కొండబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరంజ్యోతి సేవలు ప్రశంసనీయం

మండపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో మంగళవారం గుర్రాల పరంజ్యోతి 20వ వర్ధంతిని అఖిల భారత రైతుకూలీ సంఘం, భారత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను నాయకులు ప్రశంసించారు. తొలుత ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు, కార్మిక సంఘ నాయకులు ఆర్.రాఘవులు, డి.సత్యనారాయణ, కాశి పోతురాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతుల్లో కలవరం



కె.గంగవరం మండలంలో ధాన్యం రాశులపై కప్పిన బరకాలు

మండపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో మండలంలో మంగళవారం భారీవర్షం కురిసింది. ఆయా ప్రాంతాల్లో ధాన్యం రాశుల చుట్టూ వర్షం నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండపేట, తాపేశ్వరం రోడ్డు మధ్యలో వున్న కల్వర్టుల వద్ద రోడ్డు గోతులు పడటంతో ప్రమాదంగా మారింది. ద్వారపూడి ఫ్లైఓవర్ వద్ద ఏర్పడిన గోతులతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం కారణంగా ఆయా ప్రాంతాల్లో ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఖరీఫ్ మాసూళ్లు సాగుతున్నాయి. రెండు రోజులుగా వర్షం కురుస్తుండటంతో కోతకు చేరుకున్న వరి పొలాలు నేలకొరుగుతున్నాయి. మరోవైపు యంత్రాలతో కోసిన ధాన్యం రాశుల చుట్టు నీరు చేరుతుండటంతో ఆయా ప్రాంత రైతులు ఆవేదన చెందుతున్నారు.

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా మండలంలో మంగళవారం ఎడతెరపిలేని వర్షం కురిసింది. ఆయా ప్రాంతాల్లో వరి పంట మాసూళ్లు జరుగుతున్నాయి. భారీ వర్షం కారణంగా ధాన్యం రాశులపై బరకాలు వేసి రక్షణ చర్యలు చేపట్టారు. ధాన్యం రాశుల కిందకు వర్షం నీరు చేరితే పంట పాడవుతుందని ఆయా ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ కారణంగా వర్షాలు పడుతుండటంతో రైతులు కలవరం చెందుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా ప్రాంతాల్లోని ధాన్యం రాశులు పంట పొలాలు, రోడ్లపైనే ఉండిపోయాయి. వర్షం బారిన పడకుండా ఆయా ప్రాంత రైతులు బరకాలు కప్పి రక్షణ చర్యలు చేపట్టారు. భారీ వర్షంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఆత్రేయపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి వారి ఆలయ అభివృద్ధికి నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన సి.కాశీవిశ్వనాధ్, శ్రావణకుమార్ కుటుంబ సభ్యులు రూ.1,61,123 విరాళం ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. అశేష భక్తజనం స్వామివారి అన్నప్రసాదంలో పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం

కపిలేశ్వరపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్రైం రేటు తగ్గించడంతో పాటు శాంతి భద్రతలు నెలకొల్పేందుకు కృషి చేయనున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ తెలిపారు. మంగళవారం అంగర పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న కేసులతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటిని తనిఖీ చేశామన్నారు. రికార్డుల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గంజాయి నిర్మూలనకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నా లేదా వాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండపేట సీఐ రూరల్ దొరరాజు, అంగర ఎస్ఐ హరీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు స్వాగతం

రావులపాలెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సెంటర్‌లోని కోనసీమ ముఖద్వారం వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పలువురు ఘన స్వాగతం పలికారు. కోనసీమ జిల్లాలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న ఆయనకు రావులపాలెం సెంటర్లో గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రావులపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని కాకినాడ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ డైరెక్టర్ పి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు అధ్యక్షతన కెమిస్ట్రీ అధ్యాపకురాలు కె.రజిని, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణకుమార్ ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ శ్రీరామచంద్రమూర్తి పాల్గొని మాట్లాడారు. కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వ్యర్థ కాలుష్యాలు వాటి నివారణ అంశాలపై ఎలిమెంటరీ పాఠశాల స్థాయి నుంచి యునివర్సిటీ స్థాయి వరకు పాఠ్యాంశాలలో పొందుపరిచి విద్యార్థులకు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీపై దూషణలకు దిగితే సహించం’

కపిలేశ్వరపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై వ్యక్తిగత దూషణలకు దిగితే సహించమని వైసీపీ నేతలు అన్నారు. అంగరలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ సాకా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైసీపీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, విప్ పలివెల మధు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్కా సింహాచలం తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్సీ మాటలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ వక్రీకరించి వ్యక్తిగత దూషణలకు సరికాదన్నారు. వైసీపీ పాలనలోని మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్‌లు విలీనం చేసేందుకు తీర్మానానికై ఎమ్మెల్సీ ఆమోదం తెలిపారని గుర్తుచేశారు. సమావేశంలో పి.సంపతరావు, సలాది వీరబాబు, ఎంపీటీసీ దుర్గారావు తదితరులతో పాటు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బీవీలంకలో త్రైత సిద్ధాంతంపై ప్రచారం

ఆలమూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భగవద్గీత జయంతి ఉత్సవాల్లో భాగంగా బడుగువానిలంకలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. భగవద్గీతలోని వంద అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమం చేపట్టారు. బడుగువానిలంకలో రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు అధ్వర్యంలో పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం త్రైత సిద్ధాంత ప్రతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మూర్తి, లక్ష్మీనారాయణ, లోహిత, భరత్, జయరాం, సంధ్యారాణి, రాణి, సూర్యకుమారి, వేణు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈని సెలవుపై పంపండి

మంత్రి సుభాష్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ల వినతి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పురపాలక సంఘ డిప్యూటీ ఇంజనీర్ జి.శ్రీకాంత్‌ను సెలవుపై పంపాలని మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్లు మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు మంత్రిని కలిశారు. మున్సిపల్ డీఈ శ్రీకాంత్‌పై పలు ఆరోపణలు చేస్తూ ఆయన్ను తక్షణం సెలవుపై పంపాలని కోరారు. కార్యక్రమంలో విప్ సాయి ప్రసాద్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కౌన్సిలర్లు తెలిపారు.

తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయడంపై హర్షం

కపిలేశ్వరపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాల్లో విలీనం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ వైద్య ఉద్యోగులు, సిబ్బంది సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. అంగర పీహెచ్‌సీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు ఈ సందర్భంగా మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు, ఉద్యోగస్తుల సౌలభ్యం కోసం తూర్పుగోదావరి జిల్లాల్లో విలీనం చేయడంపై వక్తలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి, డిప్యూటీ హెచ్ఈవో రామారావు, హెల్త్ సూపర్‌వైజర్ నానిబాబు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.